టీడీపీకి శాశ్వత సమాధి తప్పదు

- చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారు..
- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర


పట్టణంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

సాలూరు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి శాశ్వత సమాధి కట్టబోతున్నారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు అమరావతిలో పేదలకిచ్చిన ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చడం ఆయనకు మతిభ్రమించినట్టు ఉందన్నారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రాజన్నదొర ఇంటి నుంచి బయలుదేరి మెయిన్‌రోడ్డు మీదుగా శివాజీ సెంటర్, డబ్బివీధి, కోటవీధి తదితర ప్రాంతాల మీదుగా సాగింది. ర్యాలీలో పాల్గొన్న వారంతా జై జగన్, జై రాజన్నదొర అంటూ పెద్ద ఎత్తున నినదించారు. వైఎస్సార్ కూడలి వద్ద దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదల సొంతింటి కల సాకారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే పార్టీలకతీతంగా 32 మందికి ఇళ్ల పట్టాలు అందించారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన పాలనలో ఎంత మందికి పట్టాలు ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. టీడీపీ నిర్వహించినది మహానాడు కాదని, మాయనాడు.. ఈనాడంటూ రాజన్నదొర విరుచుకుపడ్డారు. ఎన్టీఆర్ గురించి మాట్లాడే హక్కు జూనియర్ ఎన్టీఆర్‌కు తప్ప మరెవరికీ లేదన్నారు. చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మావుడి రంగునాయుడు, కొర్రజన్ని సింహాచలం, వంగపండు అప్పలనాయుడు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు, దండి శ్రీనువాసరావు, కల్లేపల్లి త్రినాధ, సువ్వాడ భరత్‌శ్రీనివాస్, గొట్టాపు ముత్యాలునాయుడు, పాచిపెంట వీరంనాయుడు, టి.గౌరీశ్వరరావు, పెద్దిబాబు, గండిపల్లి రాము, గొర్లె గణపతిరావు, రెడ్డి సన్యాసినాయుడు, రత్నాకర్, ఈశ్వరరావు, త్రినాధ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ భారీ బైక్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు, పార్టీ శ్రేణులు

బలిజిపేట: పేదల ఇళ్ల స్థలాల విషయంలో చంద్రబాబు మాటలను నిరసిస్తూ బలిజిపేట నుంచి బర్లి వరకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ సోమవారం జరిగింది. సుమారు 10 కిలోమీటర్ల పొడవునా జరిగిన ర్యాలీలో పార్టీ నేతలు, కార్యకర్తలు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారు 'మోసకారి చంద్రబాబు డౌన్ డౌన్, జగనన్న జిందాబాద్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీ ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ పేదలకిచ్చే ఇళ్ల స్థలాలను చంద్రబాబు శ్మశాన వాటికలతో పోల్చడం టీడీపీ ఓర్వలేని తనానికి నిదర్శనమన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో పేదలకు ఒక్క సెంటు భూమి ఇవ్వలేని టీడీపీ ఇప్పుడు తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ఇళ్ల స్థలం కేటాయించి వారిని ఓ ఇంటివారుగా తీర్చిదిద్ది సొంతింటి కలను నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. ర్యాలీలో మూడు మండలాల పార్టీ అధ్యక్షులు పి.మురళీకృష్ణ, బి.రాజు, బి.రమేష్, బలిజిపేట మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ ఉత్సవాలు


భక్తులచే ఆలయ పునఃప్రతిష్ఠ పూజలు చేయిస్తున్న అర్చకులు

సీతానగరం: మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిపై పూజలందుకొంటున్న అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో పునర్నించిన గర్భగుడి, సమకూర్చిన విగ్రహాలను ఆలయ ప్రధాన అర్చకుడు నాగరాజు శర్మ పర్యవేక్షణలో వేదపండితులు ఉత్సవాలను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి


పిడుగు పడి మృతి చెందిన ఆవు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గొడి పొలంలో సోమవారం సాయంత్రం పిడుగు పడి ఆవు మృతి చెందింది. సర్పంచ్ సీహెచ్ కృష్ణ అందించిన వివరాలు... లచ్చయ్యపేట గ్రామానికి చెందిన పొన్నాడ గోపి పొలంలో ఆవును మేతకు తీసుకువెళ్లాడు. ఆ సమయంలో పిడుగులతో కూడిన వర్షం కురవడంతో ఆవుపై పిడుగు మృతి చెందినట్లు తెలిపారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ రీజనల్ కో ఆర్డినేటరు ప్రకాశరావు

సీతానగరం: జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విధానం అవలంభించిన రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని ప్రకృతి వ్యవసాయ శాఖ రీజనల్ అధికారి కె.ప్రకాశరావు అన్నారు. ఆర్.వెంకంపేటలో ఏఓ ఎస్.అవినాష్ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఎండీ ఎస్ హోల్ గ్రామాల మార్పులో ప్రకృతి వ్యవసాయ నవరత్నాలు పంట సాగుకు సిబ్బంది ప్రణాళిక తయారుచేసి గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై వివరించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో మంచి లాభాలున్నాయన్నారు. గ్రామ రైతులు, మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

'గడప గడపకు' వినతులపై సమీక్ష


మాట్లాడుతున్న పంచాయితీ కార్యదర్శి వెంకటరావు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి పంచాయతీలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతులను వలంటీర్లు పరిశీలించి పరిష్కారానికి సచివాలయ ఉద్యోగుల ద్వారా చర్యలు చేపట్టాలని పంచాయితీ కార్యదర్శి జె.వెంకటరావు కోరారు. పెదబోగిలి పంచాయతీ కార్యాలయంలో గ్రామ వలంటీర్లతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించడానికి సచివాలయ ఉద్యోగులు చేస్తున్న చర్యల్లో భాగంగా గ్రామ వలంటీర్లు సహకరించాలని కోరారు.

అంటిపేటలో వేతనదారునికి గాయాలు

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామంలో సోమవారం మట్టి రోడ్డు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు వ్యక్తి తలపై పలుగు చేజారిపడడంతో గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. అంటిపేట గ్రామానికి చెందిన చుడి చెరువు పనులు ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్నాయి. పనులు జరుగుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన పి.ఈశ్వరరావు మట్టి పెల్లలు తీస్తుండగా ఒడ్డున ఉన్న పలుగు తలకు తగిలి స్వల్పంగా గాయమైంది. దీంతో తోటి ఉపాధి వేతనదారులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

నేడు సిరిమానోత్సవం

- చివరి ఘట్టానికి అమ్మవార్ల ఉత్సవాలు
- ఘనంగా తొలేళ్ల ఉత్సవం


అమ్మవారి ఘటాల ఊరేగింపు


ఎర్ర కంచెమ్మ వారి సిరిమాను


ఇప్పల పోలమ్మ వారి సిరిమానును చెక్కుతున్న భక్తులు


అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పిస్తున్న భక్తులు


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మూడు రోజులుగా జరుగుతున్న పార్వతీపురం గ్రామదేవతలు ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మ, బంగారమ్మ అమ్మవార్ల ఉత్సవాలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. సోమవారం అమ్మవారి ఘటాలు ప్రధాన రహదారిలో రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఘటాలకు పూజలు చేశారు. మంగళవారం జరగనున్న సిరిమాను మహోత్సవంతో అమ్మవార్ల ఉత్సవాలు ముగియనున్నాయి. ఇప్పటికే సిరిమాను ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం నేత్రపర్వంగా జరగనున్న ఈ ఉత్సవానికి సుమారు రెండు లక్షలకు పైబడి భక్తులు రావచ్చునని పోలీస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

అమ్మవారి ఉత్సవాల్లో భాగమైన తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన రైతులు విత్తనాలను అమ్మవారి వద్దకు తీసుకురాగా, ముత్యాల ఘటాన్ని తెచ్చిన తర్వాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. రైతులకు ఈ విత్తనాలను అందజేశారు. వరి నారు పోసే సమయంలో రైతులు పూజ చేసిన ఈ విత్తనాలను పంట పొలాల్లో కలిపి సేద్యం చేస్తే పంట దిగుబడులు బాగా వస్తాయని నమ్మకం.

ప్రణాళిక ప్రకారమే సిరిమానోత్సం

మంగళవారం నాటి సిరిమానోత్సవం ప్రణాళిక ప్రకారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఉత్సవాల నేపథ్యంలో సిరిమాను తిరిగే సాయంత్రం 5గంటల నుంచి పట్టణంలో ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయనున్నారు. ప్రజలు, భక్తులు దీనిని గుర్తించి సహకరించాలని కోరారు. ముఖ్యంగా స్థానిక బాబు జగజ్జీవన్‌రామ్ కూడలి నుంచి పాత బస్టాండ్, రాయిఘడ కూడలి వరకు రాకపోకలు పూర్తిగా నిలిపి వేస్తామన్నారు. పట్టణంలోకి ప్రవేశం చాల్సిన వారు, కృష్ణపల్లి గ్రామానికి వెళ్లాల్సిన వారు ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా బైపాస్ రోడ్డులో, సౌందర్య థియేటర్ రహదరిలో వెళ్లాల్సి ఉంటుందన్నారు. విజయగరం – ఒడిశా వెళ్లే వాహనాలు రామభద్రాపురం వయా సాలూరు మీదుగా వెళ్లాలని, ఒడిశా నుండి విజయనగరం వచ్చే వాహనాలు కొమరాడ మండలం అర్థాం గ్రామం మీదుగా చంద్రంపేట, గోపాలపురం వయా బైపాస్ రోడ్డులో మళ్లిస్తామన్నారు. పట్టణంలోకి వచ్చే వాహనదారులు, లారీలు, ఆటోలు తదితర వాహన యూనియన్లు సహకరించాలన్నారు. ఉత్సవాల క్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ప్రజలు సహకరించాలన్నారు. సమస్యలు వస్తే తక్షణమే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: పట్టణంలో కొలువైన ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ గ్రామదేవత అమ్మవార్లను ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం దర్శించుకున్నారు. పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవార్లు ఆశీర్వదించాలని కోరా రు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యు లు ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. పట్టణ ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

మెటీరియల్ కాంపొనెంట్ పనులు పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధి పథకం ద్వారా ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న మెటీరియల్ కాంపొనెంట్ పనులు పూర్తి చేసి బిల్లులు చేసేందుకు సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ భాను అధ్యక్షతన ఉపాధి పనుల పురోగతిపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా గోర్జిలు, చెరువు గట్లు, కల్వర్టులు, పాఠశాల ప్రహరీలు తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వేతనదారుల ద్వారా చేపట్టిన పనులు పూర్తవడంతో ముడి సరుకుతో నిర్మించాల్సిన కట్టడాలు ప్రారంభించక, కొన్నిచోట్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ఈ పనులు పూర్తి చేయించాలన్నారు. జగనన్న పచ్చతోరణం పథకంలో భాగంగా అంటిపేట నర్సరీలో లక్ష మొక్కలు ఉన్నాయని, వాటిని నాటేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు, జేఈ కృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించిన రైతులకు సన్మానం

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని రీజనల్ టెక్నికల్ డీపీఎం కె.ప్రకాష్ అన్నారు. మిర్తివలసలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు, ప్రయోజనాలను వివరించారు. జీవ వైవిధ్యం పెరుగుతుందని, నేలలో తేమశాతం ఎక్కువగా ఉంటుందని, మొక్కలకు కావల్సిన పోషకాలు లభ్యమవుతాయని, పశువులకు పచ్చిమేత అందుతుందని, కలుపు ఉండదని, ప్రధాన పంటల్లో అధిక, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. పచ్చిరొట్ట విత్తనాల వల్ల ప్రయోజనాలను వివరించారు. గత సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించిన రైతులు జి.సత్యారావు, ఆదినారాయణ, పద్మావతి, జి.గంగయ్యలను సన్మానించారు. సర్పంచ్ భాస్కరావు, ఎంఏబీ చైర్మన్ గంగయ్య, ఏఓ శ్రావణ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ర్యాలీ

సాలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలో వైఎస్సార్ సీపీ విజయోత్సవ ర్యాలీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సోమవారం తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అర్హులకు సంక్షేమ పథకాలు


సీలింగ్ ఫ్యాన్‌ను అందజేస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో సోమవారం పర్యటించిన ఆయన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం చేరువయ్యేలా వార్డు వలంటీర్లను, సచివాలయ వ్యవస్థను జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల అమలు, ప్రస్తుతం ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూసే వారి కోసం నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు 1902 టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్‌కు అవసరమైన సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 50 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమాని కి 50 వినతులు వచ్చాయని ఐటీడీఏ పీఓ కల్పనాకు మారి తెలిపారు. వినతుల్లో పులిపుట్టికి చెందిన పి. కరువయ్య గ్రామంలో విద్యుత్ స్తంభాలను మార్చాలని, ఏఎన్ఎం పోస్టు ఇప్పించాలని మర్రిపాడు గ్రామానికి చెందిన సాయిలక్ష్మి, జీవనోపాధులు పెంపొందించేందుకు రుణ సదుపాయం కల్పించాలని నౌగూడ గ్రామానికి చెందిన సుజాత, రచ్చబండ నిర్మించాలని బంజారుపేట గ్రామస్తులు, తాగునీటి సమస్య పరిష్కరించాలని కడగండికి చెందిన జాను, జగతపల్లి దీసరిగూడ నుంచి జాతపు జగతిపల్లికి రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు, పవర్ వీడర్ మంజూరు చేయాలని సీదిగూడ గిరిజనులు కోరారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, పీఏఓ హరికృష్ణ, ఏఎంఓ కోటిబాబు, సీడీపీఓలు రంగలక్ష్మి, విమలారాణి తదితరు లు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించండి

సీతంపేట: బడిబయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, హెచ్‌డబ్ల్యూఓలతో సోమవారం సమావేశమైన ఆమె గిరిజన గ్రామాల్లో డ్రాపౌట్ల జాబితా తయారు చేసి, వారిని బడిలో చేర్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మనబడి నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లను కూడా విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించిన రోజే ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, తరచూ వారి ఆరోగ్యాన్ని పరీక్షించాలన్నారు. ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. బాలికల పాఠశాలలకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో శతశాతం పిల్లల హాజరు నమోదు ఉండేలా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ సూర్యనారాయణ, ఓఎస్ డీ యుగంధర్, డీఈ కృష్ణకుమార్, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏటీడబ్ల్యూఓ మంగవేణి పాల్గొన్నారు.

రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వీరఘట్టం: పాలకొండ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న స్థలంలో జూన్ 1వ తేదీన నిర్వహించే రైతు దినోత్సవానికి అందరూ తరలివచ్చి, కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు భరోసా కేంద్రం సిబ్బందితో సోమవారం సమావేశమైన వారు వాస్తవానికి మే 30వ తేదీన నిర్వహించాల్సిన రైతు దినోత్సవం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. జూన్ 1న జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులంతా హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు. ఎంపీపీ వెంకటరమణనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడ లీలాప్రసాదరావు పాల్గొన్నారు.